క్లుప్తంగా

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు పెదమక్కెన విద్యార్థులు




కావూరి బాబురావు యు.మౌనిక

సత్తెనపల్లి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ జాతీయ ఉపకార వేతనాలకు సత్తెనపల్లి మండలం పెదమక్కెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన కావూరి బాబురావు, యు.మౌనికలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.వెంకట్రావు శుక్రవారం వెల్లడించారు. ఎంపికైన ఇరువురు విద్యార్థులు వరుసగా నాలుగు సంవత్సరాల పాటు జాతీయ ఉపకార వేతనాన్ని అందుకోనున్నారు. ప్రతిభ చూపి జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికై న విద్యార్థులను పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

రేపు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ఈ నెల 9న మధ్యాహ్నం 12:21 గంటలకు హైందవ సామ్రాజ్య వ్యవస్థాపకుడు శ్రీశ్రీశ్రీ ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ జరుగుతుందని ఆర్య క్షత్రియ, ఆరె మరాఠా సంఘం సభ్యులు శుక్రవారం తెలిపారు. 9న ఉదయం 6 గంటలకు శ్రీశ్రీశ్రీ ఫిరోజి రుషీంద్రుల వారి మఠం నుంచి తారక్ ఛత్రపతి నాట్య కళానిలయం తేనేటి కరుణాకర్ మాస్టార్‌చే మహారాష్ట్ర వీధి వరకు కోలాటం, నృత్యం, మేళతాళాలతో ఊరేగింపు ఉంటుందన్నారు. ఉదయం 9 గంటలకు కాషాయ ధ్వజ పూజ, 9:30 గంటలకు తుల్జా భవాని అమ్మవారి పూజ, 10 గంటలకు తుల్జా భవాని అమ్మవారి హోమం జరుగుతాయన్నారు. 12:21 గంటలకు ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ, 12:33 గంటలకు అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మలేరియాపై అవగాహనా ర్యాలీ




ముప్పాళ్ళ: మలేరియా మాసోత్సవంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన ముప్పాళ్ళలో శుక్రవారం మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు పీటర్‌డేమియన్, జోస్పిన్‌రాణిలు పాల్గొని దోమల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. రెండు మూడు రోజులకు మించి జ్వరంతో బాధపడుతుంటే సమీప ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ముప్పాళ్ళ పీహెచ్‌సీ నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ ఉస్మాన్, హెల్త్ అసిస్టెంట్ జైనుల్లా, ఎంఎల్‌హెచ్‌పీలు అజయ్, వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

అమరావతి: మండలంలోని గ్రామాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 10వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.రాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ మేకల హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు తమ తమ శాఖాపరమైన నివేదికలతో హాజరవ్వాలని ఆమె సూచించారు. మండంలోని అన్ని శాఖల మండల స్థాయి అధికారులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు తప్పక హాజరు కావాలని కోరారు.

ప్రాణం తీసిన ఈత సరదా



మృతుడు విద్యార్థి మంత్రునాయక్

బొల్లాపల్లి : సరదాగా ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన చక్రాయపాలెంలో శుక్రవారం చోటు చేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం చక్రాయపాలెంతండాకు చెందిన పది మంది యువకులు తండా సమీపంలోని ఏడుబావుల వాగు వద్ద ఈతకు వెళ్లారు. వీరితో పాటు బాణావత్ మంత్రునాయక్ (14) ఈతకు వెళ్లి మృతిచెందాడు. బాణావత్ కొండా నాయక్, సునీతబాయిల కుమారుడు మంత్రు నాయక్ వేసవి సెలవులు కావడంతో తండాలోని స్నేహితులతో కలిసి సమీపంలోని వాగు వద్దకు ఈతకు వెళ్లి మృతిచెందాడు. మృతుడు మంత్రు నాయక్ నరసరావుపేట పట్టణంలోని ఓ ప్రవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు .విద్యార్థి మృతితో తండాలో విషాదం నెలకొంది.

పాఠ్య పుస్తకాలు సిద్ధం

- 12న తెరుచుకోనున్న పాఠశాలలు
- విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు



సత్తెనపల్లిలో సిద్ధంగా ఉన్న పుస్తకాలు

సత్తెనపల్లి: విద్యార్థులకు వేసవి సెలవులు మరో వారం రోజుల్లో ముగియనున్నాయి. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో విద్యార్థులు ఆటవిడుపులకు సెలవిచ్చి చదువులకు సిద్ధమవుతున్నారు. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యా కానుక కిట్లు మండల కేంద్రాలకు చేరాయి. ప్రధానంగా రాత పుస్తకాలు, 8, 9, 10 తరగతుల పాఠ్యపుస్తకాలు, షూలు వంద శాతం, ఒకటి నుంచి ఏడు తరగతులకు చెందిన పాఠ్య పుస్తకాలు 25 శాతం అందుబాటులో ఉన్నాయి. పాఠశాలలు తెరిచే నాటికి పూర్తి స్థాయిలో విద్యా కానుకలు, పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు మండలాలకు చేరనున్నాయి. పాఠశాలలు తెరిచిన రోజు నుంచి ఒకటి, ఆరు తరగతుల్లో విద్యార్థుల చేరికలు ప్రారంభమవుతాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పుస్తకాలు అందించేందుకు చర్యలు

విద్యా సంవత్సరం పునఃప్రారంభమై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు పుస్తకాలు జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాల్లోని ఎమ్మార్సీ కార్యాలయాలకు పంపించారు. పాఠశాలలు ప్రారంభం కావడానికి మరో వారం రోజులు ఉండగానే పాఠ్య పుస్తకాలు మండల కేంద్రాలకు చేరుకున్నాయి. సత్తెనపల్లి మండలంలో మొత్తం 93 పాఠశాలలు ఉండగా వాటిల్లో ప్రాథమిక పాఠశాలలు–69, ప్రాథమికోన్నత పాఠశాలలు–6, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు–14, కేజీబీవీ–1, ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్–3 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం 10,533 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఏటా ఉచితంగా పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. సత్తెనపల్లి మండలానికి ఒకటి నుంచి పదవ తరగతి వరకు మొత్తం 85,986 పుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 45,570 పుస్తకాలు వచ్చాయి. ఇంకా 40,416 పుస్తకాలు రావాల్సి ఉంది.

ఒకటి నుంచి పది వరకు సెమిస్టర్ విధానం

ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు సెమిస్టర్–1, సెమిస్టర్–2గా విభజించి పాఠ్య పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. మండలంలో తరగతుల వారీగా విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు వేసవి సెలవులు ముగిసేలోపు మండల కేంద్రాలకు చేరాయి. పాఠశాలల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేసే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

మండలానికి 65,966 నోట్ పుస్తకాలు

సత్తెనపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు జిల్లా నుంచి 65,966 నోట్ పుస్తకాలు శుక్రవారం వచ్చాయని మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు తెలిపారు. నోట్ పుస్తకాలను ప్రత్యేకంగా గదిలో దింపామన్నారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న దృష్ట్యా పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలను కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

12న పాఠశాలలు పునఃప్రారంభం



ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి ఎమ్మార్సీకి పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయి. ఈ పాఠ్య పుస్తకాలను, నోట్ పుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నాం. ఇంకా కొన్ని పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉంది.

–ఎ.శ్రీనివాసరావు, ఎంఈవో, సత్తెనపల్లి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముప్పాళ్ళ: ముప్పాళ్ళ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో గల 11 కేవీ లైన్స్, ఉపకేంద్రంలో గల పరికరాల మరమ్మతుల కారణంగా మండలంలోని అన్ని గ్రామాల్లోను ఈ నెల 8వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమరావతిలో...

అమరావతి: మండల పరిధిలోని లేమల్లె గ్రామం వద్ద 33 కేవీ విద్యుత్ లైన్ల వద్ద చెట్ల కొమ్మలను నరకటానికి శనివారం మండల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఏఈ భాస్కర్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించాలని కోరారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి: పట్టణంలో 11 కేవీ లైన్‌లో ట్రీ కటింగ్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 8న ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. ఏదైనా విద్యుత్‌కు సంబంధించిన సమస్యలకు సత్తెనపల్లి టౌన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబరు 9494116238కు ఫోన్ చేయాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్లలో 737 ఓట్ల తిరస్కరణ

సత్తెనపల్లి: సత్తెనపల్లి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఫలితాల్లో 737 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తిరస్కరణకు గురై చెల్లకుండా పోయాయి. విద్యావంతులైన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌లో సక్రమంగా ఓటు నమోదు చేయక పోవడంతో చెల్లని ఓట్లుగా వృథా అయ్యాయన్నది చర్చనీయాంశంగా మారింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మొత్తం 2,699 పోలవగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి రాంబాబుకు 729 ఓట్లు, ఎన్డీఏ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణకు 1,167 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి చుక్కా చంద్రపాల్‌కు 32 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి పేరుపోగు నవీన్‌బాబుకు 6, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి గోదా వెంకటరమణకు 2, జై భీమ్ రావు భారత పార్టీ అభ్యర్థి జొన్నలగడ్డ విజయకుమార్‌కు 6, యుగ తులసి పార్టీ అభ్యర్థి యామోజి హనుమంతరావుకు 1, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి షేక్ దరియావలికి 2, స్వతంత్ర అభ్యర్థులు గడ్డం రాంబాబుకు 2, జక్రియ కందుకూరికి 1 ఓటు పోలయ్యాయి. 15 మంది అభ్యర్థులు పోటీ చేస్తే 10 మందికి పోస్టల్ బ్యాలెట్లు రాగా ఐదుగురికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పడలేదు.

నాల్గవ స్థానంలో నోటా

సత్తెనపల్లి నియోజకవర్గ ఓట్ల లెక్కింపులో పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించి నాల్గవ స్థానంలో నోటా నిలిచింది. ప్రధాన పార్టీలకు చెందిన ఇరువురి అభ్యర్థులతో పాటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మూడో స్థానంలో నిలవగా నాల్గవ స్థానంలో నిలిచిన నోటాకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 14 పడ్డాయి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మలేరియాపై అవగాహనా ర్యాలీ నిర్వహించిన ఆరోగ్య సిబ్బంది

రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురిలో మలేరియా మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవితేజ నాయక్ పాల్గొని మాసోత్సవ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మలేరియా నివారణను ఉద్దేశించి గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ ప్రియదర్శిని, హెల్త్ అసిస్టెంట్ రాజు, మరియదాసు, ఏఎన్ఎంలు రెహినా, ఝాన్సీ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేలా వేసవి విజ్ఞాన శిబిరం



వేసవి విజ్ఞాన శిబిరం ముగింపులో మాట్లాడుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు యల్లమందారెడ్డి



క్రోసూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు



విద్యార్థులతో అధికారులు తదితరులు

సత్తెనపల్లి: వేసవి విజ్ఞాన శిబిరాలతో పుస్తక పఠనం, ఎంతో విజ్ఞానం విద్యార్థుల సొంతమైందని రిటైర్డ్ ఉపాధ్యాయుడు పి.యల్లమందారెడ్డి అన్నారు. పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ శాఖ గ్రంథాలయంలో గత నెల 15న ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా యల్లమందారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభ అపారమని, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ వారి మేధస్సుకు పదును పెడుతూ ఆసక్తి ఉన్న రంగాల్లో తర్ఫీదునిచ్చేలా ఏర్పాటు చేసిన విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. ముఖ్యంగా సాహిత్యం, క్రీడలు, జనరల్ నాలెడ్జ్, వర్తమాన అంశాలు, ఇలా అనేక అంశాలపై వారికి పట్టు పెరుగుతుందన్నారు. ప్రతిరోజు విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, నీతి కథల పుస్తకాలను చదివిస్తూ అందులోని నీతిని వివరించడంతోపాటు స్వాతంత్ర్య సమరయోధుల వీర గాథలను, దేశ చరిత్రను వివరిస్తూ విద్యార్థుల్లో చరిత్రపై అవగాహన కలిగేలా తీర్చిదిద్దారన్నారు. కథలు, నవలలతో పాటు ఆటల పుస్తకాలను కూడా చదివించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వై.రజని, ఎస్.రమేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

అమరావతి: అమరావతి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. గ్రంథాలయాధికారి వెంకాయమ్మ ఆధ్వర్యంలో చిత్రలేఖనం, వ్యాసరచన, యోగా, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లిష్, ఆటపాటలతో పాటు కూచిపూడి డ్యాన్స్ విద్యార్థులకు నేర్పించారు. శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణారావు, అమరేశ్వరాలయ ఈవో వేమూరి గోపినాథ శర్మలు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించటానికి కథలు చెప్పటం, చదరంగం, ఇతర ఆటలు ఈ శిక్షణ శిబిరంలో నేర్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఈ శిబిరం బాగా ఉపకరించిందని తహసీల్దార్ వెంకటరమణారావు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహక కమిటీ సభ్యులు చేకూరి జాజిబాబు, పుట్టి నాగేశ్వరరావులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులు

క్రోసూరు: గత 24 రోజులుగా జరిగిన గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ పెద్దలు మన్నెం సాంబశివరావు, ఉపాధ్యాయురాలు జి.పద్మావతి పాల్గొన్నారు. విద్యార్థులకు డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, ఇంగ్లిష్ మాట్లాడటం, సులభ మ్యాథమెటిక్స్, క్రీడలు మొదలైన వాటిపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ తెలియజేశారు. అదే విధంగా పలు అంశాలపై పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయటం జరిగిందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపాధ్యాయురాలు జి.పద్మావతి మాట్లాడుతూ పుస్తక పఠనం ప్రతి మనిషిని ఉత్తమంగా తీర్చిదిద్దతుందని, అదే విధంగా ఆత్మగౌరవం పెంపొందించుకోవటం జరుగుతుందన్నారు. విద్యార్థులు చదవుతో పాటు ఆటపాటలలో కూడా ముందుండాలని గ్రంథాలయ అధికారి కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తా



పట్టణంలో ర్యాలీలో అభివాదం చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తానని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఆయన శుక్రవారం తొలిసారి నియోజకవర్గంలోకి అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు నుంచి కన్నా లక్ష్మీనారాయణకు ఘన స్వాగతం పలికి పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించిన సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఈ విజయం సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలకు అంకితమని, తాము పాలకులం కాదు సేవకులం అని నిరూపిస్తామన్నారు. ముందుగా శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ వేద పాఠశాల ఎదుట విద్యార్థులు ఆశీర్వచనం అందించారు. అనంతరం పార్టీ నాయకులు గజమాలలతో సత్కరించారు. అలాగే డీఎస్పీ జి.గురునాథ్‌బాబు, సీఐలు పోలూరి శ్రీనివాసరావు, ఎం.రాజేష్ కుమార్, ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, ఎం.సత్యనారాయణలు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

ఏడీఏ హనుమంతరావు



విత్తన షాపులను తనిఖీ చేస్తున్న ఏడీఏ

పెదకూరపాడు: విత్తన విక్రయ షాపుల యజమానులు విత్తనాలను ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతరావు విత్తన డీలర్లను హెచ్చరించారు. మండలంలోని పెదకూరపాడు, 75త్యాళ్లూరు గ్రామాలలోని విత్తన షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన డీలర్లకు సూచనలు చేశారు. సోర్స్ సర్టిఫికెట్ లేకుండా విక్రయించరాదని, విత్తన స్టాక్ రిపోర్టుల బోర్డులను ప్రతి షాపులో తప్పనిసరిగా ఉంచాలని, ఏ రోజుకారోజు విత్తన నిల్వలను నమోదు చేయాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేయగానే తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. పంట కాలం పూర్తయ్యే వరకు వాటిని భద్రపరుచుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. బిల్లులో లాట్ నెంబర్, కంపెనీ పేరు ఉండే విధంగా ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఐ.శాంతి, విత్తనషాపుల డీలర్లు ఉన్నారు.

అనుమతులు లేని విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

అచ్చంపేట వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు



విత్తన విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏవో

అచ్చంపేట: రైతులకు అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అచ్చంపేట వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు విత్తన షాపు డీలర్లను హెచ్చరించారు. సాధారణ తనిఖీలలో భాగంగా మండలంలోని విత్తన షాపులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ప్రకృతి వ్యవసాయ రైతు సేవా కేంద్రం షాపులో అనుమతి పత్రాలు లేకుండా విక్రయిస్తున్న 20 ప్యాకెట్ల పత్తి విత్తనాలను సీజ్ చేసి ఈసీ యాక్ట్ కింద 6ఏ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వీటి ధర రూ.17,280 ఉంటుందన్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని విత్తన విక్రయదారులు రైతులకు ప్రభుత్వ అనుమతులు, కంపెనీ పీసీలు ఉన్న నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. రైతు అడిగినా అడగకపోయినా బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీలకు మించి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లూజ్ విత్తనాలు విక్రయించడం నేరమన్నారు. స్టాక్ రిజిస్టర్స్, విత్తన నిల్వ పట్టికలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. పత్తి విత్తన రకానికి తప్పనిసరిగా అనుమతి సర్టిఫికెట్ ఉండాలన్నారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

- మాంసం, కిరాణా దుకాణాల పరిశీలన
- ముగ్గురిపై కేసులు నమోదు



కొండవీడులోని షాపులో తనిఖీ చేస్తున్న శివశంకర్

యడ్లపాడు: వ్యాపారులు వినియోగదారుల్ని మోసగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పల్నాడు జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ హెచ్చరించారు. మండలంలోని కొండవీడు గ్రామంలో తూనికలు, కొలతలశాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని మూడు మాంసం విక్రయాల దుకాణాల్లో పరిశీలన చేశారు. వాటిలో ప్రామాణిక ముద్రలు (సీళ్లు) లేని తూకం రాళ్లను గుర్తించారు. ఇదే గ్రామంలోని కిరణా షాపుల్లో కూల్ డ్రింక్స్‌ను ఎమ్మార్పీ ధరకు మించి అమ్మకాలను చేస్తున్నట్లు తనిఖీల్లో తెలిసిందన్నారు. తూకాల్లో, విక్రయాల్లో అవకతవకలకు పాల్పడుతున్న ఆయా దుకాణాల యజమానులపై లీగల్ మెట్రాలజీ చట్టం 2009 కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే నాదెండ్ల మండలంలోని సంక్రాంతిపాడు గ్రామంలోనూ పలు దుకాణాల్లో తనిఖీలు చేసి వారిపై కేసులు నమోదు చేశామన్నారు. మార్కెట్లో తూకాలపై అనుమానాలు వస్తే తమ దృష్టికి తీసుకువచ్చి, వినియోగదారుల హక్కుల్ని కాపాడేందుకు ప్రజల భాగస్వాములు కావాలన్నారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్స్



మతి స్థిమితం లేని మహిళకు సేవలు చేస్తున్న మహిళా కానిస్టేబుల్స్

దాచేపల్లి : మతి స్థితిమితం లేని గుర్తు తెలియని మహిళకు మహిళా కానిస్టేబుల్స్ సేవలు చేసి మానవత్వం చాటుకున్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీలోని కారంపూడి బస్టాండ్ సెంటర్‌లో డివైడర్‌పై స్పృహ కోల్పోయి పడి ఉన్న మహిళకు సేవలు చేసి శభాష్ అనిపించుకున్నారు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సూమారు 50 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని మహిళ డివైడర్‌పై పడి ఉంది. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణమే స్పందించిన సీఐ ఎ.సురేంద్రబాబు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్స్ మస్తాన్‌బీ, విక్టోరియా రాణిలను కారంపూడి సెంటర్‌కి పంపించారు. వివస్త్రగా స్పృహ తప్పి పడి ఉన్న మహిళకు వారి వెంట తీసుకెళ్లిన వస్త్రాలను చుట్టారు. మంచినీరు తాపించి వివరాలు సేకరించే ప్రయత్నం చేశారు. మహిళ స్పృహలోకి వచ్చిన తరువాత సమీపంలోని వీర్ల అంకమ్మతల్లి దేవాలయం వద్దకి తీసుకెళ్లారు. సదరు మహిళ గత కొన్ని నెలలుగా ఇక్కడే ఉంటుందని దేవాలయ సిబ్బంది పోలీసులతో చెప్పారు. మహిళకు సేవ చేసిన మహిళా కానిస్టేబుల్స్ మస్తాన్‌బీ, విక్టోరియా రాణిని పోలీస్ అధికారులు, స్థానికులు అభినందించారు.

మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండ (నూజెండ్ల): ఏపీ మోడల్ స్కూల్ నూజెండ్లలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6,7,8,9 తరగతులతో పాటు ఇంటర్ మొదటి విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. పాఠశాలలో చేరే విద్యార్థులు ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.